క్లుప్తంగా...

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం



క్రికెట్ ఆడుతున్న యువకులు

మేడ్చల్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జిల్లాస్థాయి క్రికెట్ టోర్నమెంట్ మేడ్చల్‌లో ప్రారంభమైంది. పట్టణంలోని కేఎల్ఆర్ వెంచర్‌లోని ప్రైవేటు మైదానంలో నిర్వహిస్తున్న టోర్నమెంట్‌ను జిల్లా గేమ్స్ ఆర్గనైజింగ్ సెక్రటరి వినోద్‌కుమార్ ప్రారంభించారు. అండర్–14 విభాగంలో టోర్నమెంట్‌ను నిర్వహిస్తున్నారు. మొదటి మ్యాచ్‌లో కీసర కూకట్‌పల్లి జట్లు తలపడగా కూకట్‌పల్లి జట్టు విజయం సాధించాయి. రెండవ మ్యాచ్‌లో మేడ్చల్, ఘట్‌కేసర్ జట్లు తలపడ్డాయి.

108 వాహనంలో ప్రసవం



మేడ్చల్: గర్భిణికి 108 వాహనంలో సిబ్బంది ప్రసవం చేశారు. గుండ్లపోచంపల్లికి చెందిన రాజేశ్వరికి పురిటి నొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు 108వాహనానికి సమాచారం అందించారు. ఈఎంటీ సీతారాం, పైలెట్ మోహన్‌రెడ్డి ఆమెను వాహనంలో తీసుకుని మేడ్చల్ ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్తుండగా అయోధ్య క్రాస్‌రోడ్ వద్దకు చేరుకోగానే ఆమెకు నొప్పులు ఎక్కువ కావడంతో సిబ్బంది వాహనంలోనే ప్రసవం చేశారు. రాజేశ్వరి ఆడ శిశువుకు జన్మనిచ్చింది. తల్లీబిడ్డా క్షేమంగా ఉండటంతో వారిని మేడ్చల్‌లోని ప్రభుత్వ ఆస్పత్రిలో సిబ్బంది చేర్పించారు.

స్టేట్ లెవెల్ కబడ్డీకి మూడు చింతలపల్లి విద్యార్థులు



రాష్ట్రస్థాయి కబడ్డీకి ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

శామీర్‌పేట్: రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు మూడుచింతలపల్లి మండలానికి చెందిన ఇద్దరు విద్యార్థులు ఎంపికయ్యారు. మండల పరిధిలోకి జగ్గంగూడ జీనియస్ గ్రామర్ స్కూల్‌లో 9వ తరగతి చదువుతున్న బి.సిద్ధార్థ్, డి.నర్సింలును శామీర్‌పేట జోన్ ఎస్‌జీఎఫ్ సెక్రెటరీ సత్తిరెడ్డి వీరిన ఎంపిక చేశారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ క్రిష్ణారెడ్డి, ప్రిన్సిపల్ కల్పన, ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు.

డ్రైనేజీ పనులు ప్రారంభం



డ్రైనేజీ పనులు ప్రారంభిస్తున్న కౌన్సిలర్లు

మేడ్చల్: పట్టణంలోని ఎస్‌జీఓ కాలనీ నూతనంగా నిర్మిస్తున్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులను కౌన్సిలర్లు నర్సింహస్వామి యాదవ్, ఉమానాగరాజు ప్రారంభించారు. ఇద్దరు కౌన్సిలర్లు 5, 16వ వార్డుల పరిధిలో నిర్మిస్తున్న డ్రైనేజీ పనులకు పూజా కార్యక్రమాలు నిర్వహించి పనులు ప్రారంభించారు. రెండు వార్డుల పరిధిలో సంపూర్ణ సీసీ రోడ్లు, సంపూర్ణ అండర్ గ్రౌండ్ డ్రైనేజీల నిర్మాణం చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వార్డుల నాయకులు కమ్రుద్దీన్, వార్డు ఆఫీసర్ విఘ్నేష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల ధర్నా



మేడ్చల్: మేడ్చల్ మున్సిపాలిటీ పరిధిలో పని చేస్తున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఉద్యోగులు మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. మున్సిపల్ కార్యాలయం ఎదుట శిబిరం ఏర్పాటు చేసుకుని ఉద్యోగులు ధర్నా నిర్వహించగా కౌన్సిలర్ నర్సింహస్వామి యాదవ్ వారికి మద్దతు ప్రకటించారు. ఔట్ సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్న ఉద్యోగులను ప్రభుత్వం పర్మనెంట్ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. ధర్నాలో ఉద్యోగులు పెంటయ్య, సుందర్‌రెడ్డి, పాషా, మహేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గురువు వెంటే శిష్యుడు

- కాంగ్రెస్‌లో చేరనున్న మల్కాజిగిరి ఎమ్మెల్యే మైనంపల్లి
- గురువు బాటలోనే నడవనున్న నక్క ప్రభాకర్‌గౌడ్
- మేడ్చల్ కాంగ్రెస్ టికెట్ ఆశిస్తున్న బీసీ నేత
- గతంలో టీడీపీ, బీఎస్పీ నుంచి పోటీ



నక్క ప్రభాకర్‌గౌడ్





మైనంపల్లి హన్మంత్‌రావు

మేడ్చల్: బీఆర్ఎస్ తిరుగుబాటు ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంత్‌రావు ప్రభావం మేడ్చల్ రాజకీయాల్లో చూపనుంది. రాజకీయంలో మొదటి నుంచి ఆయనకు శిష్యుడిగా ఉన్న నియోజకవర్గ సీనియర్ రాజకీయ నాయకుడు బీఆర్ఎస్ నేత నక్క ప్రభాకర్‌గౌడ్ గురువు వెంటే నడిచేందుకు సిద్ధమవుతున్నాడు. మైనంపల్లి హన్మంత్‌రావు కాంగ్రెస్‌లో చేరడం ఖాయం కావడంతో నక్క ప్రభాకర్ సైతం మైనంపల్లి వెంటే కాంగ్రెస్‌లో చేరుతున్నట్లు ప్రకటించారు. తనతో పాటు నియోజకవర్గంలోని తన అనుచరులు ఏ పార్టీలో ఉన్నా అందరూ కాంగ్రెస్‌లో చేరుతున్నారని అన్నారు. మైనంపల్లి హన్మంతరావు చేరిన రోజే తాను కాంగ్రెస్‌లో చేరుతున్నానని ఆయన చెప్పారు.

మేడ్చల్ టికెట్ ఆశిస్తున్న ప్రభాకర్‌గౌడ్..

గతంలో టీడీపీ తరఫున, బీఎస్పీ తరఫున మేడ్చల్ నుంచి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయిన ప్రభాకర్‌గౌడ్ ఈ ఎన్నికల్లో మేడ్చల్ టికెట్ ఆశిస్తున్నారు. అధికార బీఆర్ఎస్‌లో ఉన్నా తనకు టికెట్ రాకపోవడంతో బీఆర్ఎస్ రెబల్‌గా బీఎస్పీ నుంచి గత ఎన్నికల్లో పోటీ చేశారు. ఈ ఎన్నికల్లో టికెట్ రాకపోవడంతో నిరాశగా ఉన్న ఆయన అనూహ్యంగా చోటు చేసుకున్న రాజకీయ పరిణామాలతో కాంగ్రెస్ గూటికి చేరుతున్నారు. తన రాజకీయ గురువు మైనంపల్లి తనకు మేడ్చల్ కాంగ్రెస్ టికెట్ ఇప్పిస్తానని హామీ ఇచ్చారని, మేడ్చల్ కాంగ్రెస్ టికెట్ తనకే వస్తుందని ధీమాగా ఉన్నారు. ఈ ఎన్నికల్లో పోటీ చేసి మేడ్చల్ ఎమ్మెల్యేగా గెలిచి తన లక్ష్యాన్ని తప్పకుండా చేరతానని తెలిపారు. కాంగ్రెస్ నాయకులతో కలిసి ఇప్పటికే చర్చలు జరిపామని, టికెట్ తనకు కేటాయిస్తారనే హామీ వచ్చిందని ఆయన అన్నారు.

మూడు టికెట్లు ఆశిస్తున్న మైనంపల్లి..

కొడుకుకు టికెట్ కేటాయించకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేసిన మైనంపల్లి బీఆర్ఎస్‌కు దూరమయ్యారు. కాగా తన భవిష్యత్ కోసం కాంగ్రెస్‌లో చేరడం లాంఛనంగా మారింది. తనకు మాల్కాజిగిరి అసెంబ్లీ స్థానం, తన కుమారుడు రోహిత్‌కు మెదక్ అసెంబ్లీ స్థానం, తన శిష్యుడు నక్క ప్రభాకర్‌గౌడ్ కోసం మేడ్చల్ టికెట్లు కాంగ్రెస్ నుంచి ఆశిస్తున్నారు. ఈ మేరకు కాంగ్రెస్ అధిష్టానం పెద్దల వద్ద మూడు సీట్ల కోసం ప్రతిపాదన ఉంచి వారి ఆమోదం తర్వాతే కాంగ్రెస్‌లో చేరాలని నిర్ణయం తీసుకున్నారని ఆయన అనుచరులు చెబుతున్నారు.

బీసీ నేతగా ముద్ర..

నక్క ప్రభాకర్‌గౌడ్ మేడ్చల్ నియోజకవర్గంలో సీనియర్ రాజకీయ నాయకుడు. బీసీ నేతగా ముద్ర పడిన నాయకుడు. గతంలో టీడీపీ హయాంలో నాయకుడిగా ఎదిగారు. టీడీపీలో ఉన్న సమయంలో శామీర్‌పేట్ మండల జెడ్పీటీసీగా పని చేశారు. 2014 ఎన్నికల్లో టీడీపీ మేడ్చల్ అభ్యర్థిగా పోటీ చేశారు. 2019 ఎన్నికల్లో మేడ్చల్ బీఆర్ఎస్ టికెట్ ఆశించి భంగపడి బీఎస్పీ నుంచి రెబల్‌గా పోటీ చేశారు. ఇప్పటి వరకు బీఆర్ఎస్‌లోనే కొనసాగుతూ ఎమ్మెల్యే మైనంపల్లికి అండగా ఉంటూ ఆయన శిష్యుడిగా రాజకీయం చేస్తూ ఉన్నాడు. బలమైన నాయకుడు కావడం, రాజకీయంగా సుదీర్ఘ అనుభవం ఉండటంతో నియోజకవర్గంలో ప్రత్యేక అనుచరులతో రాజకీయం నడిపిస్తున్నారు. మైనంపల్లి అభిమానులు, నక్క ప్రభాకర్‌గౌడ్ అభిమానులు ఆయనకు మద్దతుగా ఉండటంతో భవిష్యత్‌తో చేరికలు బాగానే ఉండే అవకాశం కనిపిస్తోంది.

కాంగ్రెస్‌లో సాధ్యమేనా..

కాంగ్రెస్ పార్టీలో ఏదైనా సాధ్యమే అనే చర్చలు ఎక్కువగా వినిపిస్తున్నాయి. మైనంపల్లి హనమ్మంత్‌రావు బలమైన నాయకుడు కావడం, మాస్ ఫాలోయింగ్ ఉన్న నేత కావడం, ఆయనకు నగరం, నగర శివార్లలోని నియోజకవర్గాల్లో ఎక్కువ మంది ఫాలోవర్స్ ఉండటంతో ఆయన మేడ్చల్ టికెట్ తన శిష్యుడికి ఇప్పించుకుని తన ప్రభావం చాటాలనే ప్రయత్నాల్లో ఉండటంతో మేడ్చల్‌పై ఆసక్తి పెరిగింది. కాంగ్రెస్‌లో ఉన్న ఇద్దరు బలమైన నేతలు హరివర్ధన్‌రెడ్డి, జంగయ్యయాదవ్‌లు ఇప్పటికే టికెట్ కోసం కుస్తీపడుతుండగా వారి సరసన నక్కా ప్రభాకర్‌గౌడ్ చేరుతుండటంతో మేడ్చల్ కాంగ్రెస్ రాజకీయం ఆసక్తిగా మారింది. కాంగ్రెస్‌లో పూర్తి ప్రజాస్వామ్య స్వేచ్ఛ ఉండటంతో ఆ పార్టీలో ఏదైనా సాధ్యమేననే గుసగుసలు జోరుగా వినిపిస్తున్నాయి.

భూమి లేకుండా సభ్యత్వమున్న వారిని అనర్హులుగా ప్రకటించాలి

ఘట్‌కేసర్: రైతు సేవా సహకార సంఘంలో భూమి లేకుండా సభ్యత్వమున్న రైతులను అనర్హులుగా ప్రకటించాలని ఆ సంఘం డైరెక్టర్ ధర్మారెడ్డి డిమాండ్ చేశారు. పట్టణంలో సోమవారం ఆయన మాట్లాడుతూ రైతు సేవా సహకార సంఘం సాధారణ సమావేశానికి రాజకీయ నాయకుల ముసుగులో వచ్చే సభ్యులు కాని వారిని నిరోధించాలన్నారు. విక్రయించిన వ్యవసాయ భూములను తాకట్టు పెట్టి రుణం తీసుకున్న వారిపై చర్యలు తీసుకోవాలని, రుణం పొందేందుకు మార్టిగేజ్ నియమం అందరికీ ఒకే విధంగా ఉండాలన్నారు. సంఘం ప్రహరీ నిర్మాణ పనులు, బినామీ రుణాలు తీసుకున్న వారిపై విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పాలకమండలి సభ్యుల కుటుంబ సభ్యులను ఉద్యోగులుగా తీసుకోకుండా తీర్మానం చేయాలన్నారు.

కీసరగుట్ట రామలింగేశ్వరస్వామి హుండీ లెక్కింపు



కీసర: కీసరగుట్ట రామలింగేశ్వరస్వామి హుండీ లెక్కింపు సోమవారం చేపట్టారు. ఈ మేరకు దేవాలయం మహా మండపంలో ఆలయ చైర్మన్ తటాకం రమేష్, ఈఓ నరేందర్ ఆధ్వర్యంలో గుట్ట సిబ్బందితో పాటు స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు హుండీ లెక్కించారు. స్వామి వారికి రూ.26,64,234 ఆదాయం వచ్చినట్లు ఆలయ చైర్మన్ తటాకం రమేష్ తెలిపారు. హుండీ ద్వారా వచ్చిన ఆదాయాన్ని కీసరగుట్ట స్వామి పేరిట కీసర ఎస్‌బీఐ బ్యాంకులో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసినట్లు చెప్పారు.

మహిళలు, యువత స్వయం ఉపాధి సాధించుకోవాలి



మాట్లాడుతున్న సర్పంచ్ సురేందర్‌ముదిరాజ్

మేడ్చల్: ఎవరిపై ఆధారపడకుండా మహిళలు, యువత స్వయం ఉపాధి సాధించాలని రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం అధికార ప్రతినిధి గౌడవెల్లి సర్పంచ్ సురేందర్‌ముదిరాజ్ అన్నారు. గౌడవెల్లిలో సీఓడబ్ల్యూఈ సంస్థ నిర్వహించిన స్వయం ఉపాధి శిక్షణ అవగాహన సదస్సును ఆయన ప్రారంభించారు. మహిళల కోసం, యువత కోసం ఎన్నో సంస్థలు స్వయం ఉపాధి కోసం ఉచిత శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయని, వాటిని సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా అభివృద్ధి సాధించాలన్నారు. గ్రామ మహిళలు శిక్షణ కార్యక్రమాలకు హాజరై సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వార్డు సభ్యుడు సదానందగౌడ్, సంస్థ ప్రతినిధులు, మహిళలు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

కీసర: రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన ఘటన ఆదివారం అర్ధరాత్రి కీసర పోలీస్ స్టేషన్ పరిధిలోని చీర్యాల చౌరస్తా వద్ద చోటు చేసుకుంది. కీసర సీఐ వెంకటయ్య తెలిపిన వివరాల ప్రకారం దమ్మాయిగూడ మున్సిపల్ పరిధిలోని కుందన్‌పల్లిలో నివాసముంటున్న రాజు(20) ఆదివారం అర్ధరాత్రి రాంపల్లి ఆర్ఎల్‌నగర్ నుంచి ద్విచక్రవాహనంపై కుందన్‌పల్లికి వస్తుండగా చీర్యాల చౌరస్తా సమీపంలోకి రాగానే ద్విచక్రవాహనం అదుపుతప్పి రోడ్డు డివైడర్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టమ్ నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేసున్నట్లు తెలిపారు.

ఊరెళ్లొచ్చే సరికి ఇల్లుగుల్ల

ఘట్‌కేసర్: ఊరెళ్లొచ్చే సరికి గుర్తు తెలియని దుండగులు ఇల్లుగుల్ల చేసిన ఘటన ఘట్‌కేసర్ పీఎస్‌లో పరిధిలో ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. డీఐ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం.. ఘట్‌కేసర్ పట్టణంలోని బాలాజీనగర్‌లో నివాసముంటున్న మహమ్మద్ అలీ ఆదివారం కుటుంబ సభ్యులతో కలిసి బాలానగర్‌లోని బంధువుల ఇంటికి వెళ్లాడు. తిరిగి సోమవారం ఉదయం తిరిగి రాగా ఇంటి తాళం పగులగొట్టి ఉంది. లోపలికి వెళ్లి పరిశీలించగా బీరువాలో దాచుకున్న 7 గ్రాముల బంగారం, రూ. 30 వేలు నగదు గుర్తు తెలియని దుండగులు ఎత్తుకెళ్లారని గుర్తించి పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత





స్వచ్ఛత హీ సేవాలో మున్సిపల్ చైర్మపర్సన్ ప్రణితాగౌడ్

మేడ్చల్: స్వచ్ఛత హీ సేవా స్వచ్ఛత లీగ్ ఐఎస్ఎల్ 2.0 కార్యక్రమంలో భాగంగా మున్సిపాలిటీ ఆధ్వర్యంలో పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర పాఠశాలలో స్వచ్ఛత హీ సేవా కార్యక్రమం నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ త్రిలేశ్వర్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని అన్నారు. పర్యావరణానికి హాని చేసే వస్తువులను సాధ్యమైనంత వరకు వాడొద్దని అన్నారు. స్వచ్ఛత కోసం విద్యార్థుల చేత అధికారులు ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎన్విరాన్‌మెంట్ ఏఈ జ్ఞానేశ్వర్, ఉపాధ్యాయులు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

తడి పొడి చెత్తను వేరు చేసి అందించాలి

కీసర: దమ్మాయిగూడ మున్సిపాలిటీ పరిధిలోని 18వ వార్డులో ప్రభుత్వ స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంలో భాగంగా పాఠశాల పరిసరాల ప్రాంతంలో ప్రజలకు తడి పొడి చెత్తను మున్సిపల్ వాహనాల వారికి అందించే విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ వసుపతి ప్రణితాగౌడ్ పాల్గొన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ మాదిరెడ్డి నరేందర్‌రెడ్డి, కౌన్సిలర్ రామారం శ్రీహరిగౌడ్, మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రభు, మున్సిపల్ స్టాఫ్, సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల స్వచ్ఛత ప్రతిజ్ఞ

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీలో స్వచ్ఛ్ సర్వేక్షన్‌లో భాగంగా సోమవారం స్వచ్ఛ్ లీగ్ కార్యక్రమం నిర్వహించారు. మున్సిపల్ పరిధిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మున్సిపల్ కమిషనర్ రాములు స్వచ్ఛతపై అవగాహన కల్పించి అనంతరం వారితో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా పండిట్ దీన్‌దయాళ్ జయంతి



మేడ్చల్‌లో దీన్‌దయాళ్ చిత్రపటం వద్ద బీజేపీ నాయకులు



ఘట్‌కేసర్‌లో పండిట్ దీన్‌దయాళ్ జయంతి వేడుకలు

మేడ్చల్: పండిట్ దీన్‌దయాళ్ జయంతిని మేడ్చల్ మున్సిపాలిటీలో బీజేపీ నాయకులు సోమవారం నిర్వహించారు. ఐటీఐ వద్ద కోర్టు రోడ్డులో దీన్‌దయాళ్ చిత్రపటం ఏర్పాటు చేసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బీజేపీ నాయకులు జగన్‌గౌడ్, ప్రేందాస్, వంశీ పంజరి, రాఘవరెడ్డి, శ్రీకాంత్‌పాల్గొన్నారు.

ఆశయసాధనకు కృషి చేయాలి

ఘట్‌కేసర్: దీన్‌దయాళ్ ఆశయాలకు అనుగుణంగా ముందుకెళ్లాలని ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో సోమవారం పండిట్ దీన్‌దయాళ్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేశారు. ఉప సర్పంచ్ నరేశ్, ఎస్సీ మోర్చా జిల్లా అధికార ప్రతినిధి శ్రీకాంత్, బీజేవైఎం ఉపాధ్యక్షుడు శివనాయక్, కార్యదర్శి నరేందర్‌రెడ్డి, పోచారం మున్సిపాలిటీ ప్రధాన కార్యదర్శులు అజయ్‌యాదవ్, నరేశ్, ఓబీసీ మోర్చా అధ్యక్షుడు కృష్ణ, కిసాన్ మోర్చా అధ్యక్షుడు వీరారెడ్డి, బీజేవైఎం ప్రధాన కార్యదర్శి బాబు, ఘట్‌కేసర్ మున్సిపల్ బీజేవైఎం ఉపాధ్యక్షుడు అనిల్, ప్రేమ్‌కుమార్, రాజు పాల్గొన్నారు.

అభివృద్ధిలో నంబర్‌వన్ గుండ్లపోచంపల్లి

రూ.3.24 కోట్ల అభివృద్ధి పనులను ప్రారంభించిన మంత్రి మల్లారెడ్డి



గుండ్లపోచంపల్లిలో అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్న మంత్రి మల్లారెడ్డి

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ జిల్లాలోని అన్ని మున్సిపాలిటీల కంటే వేగంగా అన్ని విధాల అభివృద్ధి చెంది నంబర్ వన్ స్థానంలో నిలిచిందని మంత్రి మల్లారెడ్డి అన్నారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీలో పలు వార్డుల్లో రూ.3.24 కోట్ల నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులను సోమవారం మంత్రి మల్లారెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ మద్దుల లక్ష్మీశ్రీనివాస్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ ఆర్థికంగా, అభివృద్ధిపరంగా అన్నివిధాలా ఉండటంతో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని పనులు చేపడుతున్నట్లు తెలిపారు. మున్సిపల్ అభివృద్ధి కోసం పాలకవర్గ సభ్యులు నిరంతరం శ్రమించడం సంతోషకరం అన్నారు. మున్సిపాలిటీ అన్ని విధాల మరింత అభివృద్ధి పరిచి ఆదర్శంగా నిలుపుతానని తెలిపారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ ప్రభాకర్, కమిషనర్ రాములు, కౌన్సిలర్లు జైపాల్‌రెడ్డి, హేమంత్‌రెడ్డి, మల్లిఖార్జున్ ముదిరాజ్, బాల్‌రాజ్, నాయకులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లోకి వార్డు సభ్యులు



మంత్రి సమక్షంలో పార్టీలో చేరుతున్న వార్డు సభ్యులు

మండలంలోని పూడూర్ గ్రామానికి చెందిన ముగ్గురు వార్డు సభ్యులు సోమవారం మంత్రి మల్లారెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. గ్రామ సర్పంచ్ బాబుయాదవ్, మార్కెట్ కమిటీ చైర్మన్ భాస్కర్‌యాదవ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు దయానంద్‌యాదవ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ గ్రామ వార్డు సభ్యుడు జనార్దన్‌యాదవ్, శశికుమార్‌యాదవ్, ఇండిపెండెంట్ సభ్యులు మాణిక్యం మంత్రి కార్యాలయంలో పార్టీలో చేరారు. మంత్రి మల్లారెడ్డి వారికి పార్టీ కండువా కప్పి పార్టీలో ఆహ్వానించారు. బీఆర్ఎస్ మల్కాజిగిరి పార్లమెంట్ ఇన్‌చార్జి మర్రి రాజశేఖర్‌రెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జి మహేందర్‌రెడ్డి, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, ఉపసర్పంచ్ మానేపల్లి వెంకటేశ్, వార్డు సభ్యులు శ్రీకాంత్, నాయకులు శంకర్, డప్పు క్రిష్ణ, నాగేశ్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

విగ్రహ ఏర్పాటు పనులు ఆపాలని వినతి



మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న బీజేపీ నాయకులు

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపల్ కార్యాలయం ఎదుట విగ్రహ ఏర్పాటు కోసం చేపడుతున్న పనులు ఆపాలని బీజేపీ నాయకులు మున్సిపల్ కమిషనర్ రాములుకు వినతిపత్రం అందజేశారు. మున్సిపాలిటీ పరిధిలో పెరుగుతున్న జనాభా దృష్ట్యా నిత్యం రద్దీగా ఉండే మున్సిపాలిటీ చౌరస్తాలో విగ్రహాలను పెట్టడంతో ప్రజలు, వాహనదారులు ఇబ్బందులకు గురవడంతో పాటు ప్రమాదాల బారిన పడుతున్నారని బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ మోహన్‌రెడ్డి తెలిపారు. ప్రజలకు ఇబ్బంది కలిగే ప్రదేశాల్లో విగ్రహాల ఏర్పాటుకు మున్సిపల్ నుంచి అనుమతులు ఇవ్వకూడదని కమిషనర్‌కు కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ బీజేపీ అధ్యక్షులు శ్రీనివాస్ ముదిరాజ్, కౌన్సిలర్ సరస్వతి, నాయకులు కావేరి శ్రీధర్, నవీన్‌కుమార్, శ్రీకాంత్, డానియల్, విరాట్ తదితరులు పాల్గొన్నారు.

డ్వాక్రా భవన్‌లో స్టీల్ బ్యాంకు ప్రారంభం



డ్వాక్రా భవన్‌లో స్టీల్ బ్యాంకును ప్రారంభిస్తున్న మేయర్ కావ్య, కమిషనర్ రామలింగం

జవహర్‌నగర్: స్వచ్ఛతా హి సేవా కార్యక్రమంలో భాగంగా మెప్మా ఆధ్వర్యంలో జవహర్‌నగర్ కార్పొరేషన్‌లోని డ్వాక్రా భవన్‌లో స్టీల్ బ్యాంకును సోమవారం మేయర్ మేకల కావ్య, కమిషనర్ రామలింగం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. స్వచ్ఛ జవహర్‌నగర్‌గా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ప్లాస్టిక్ రహిత సమాజానికి కృషి చేద్దామన్నారు. ప్లాస్టిక్‌కు నివారించి ఆరోగ్యాన్ని కాపాడుకుందామన్నారు. స్టీల్ వస్తువులనే వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో కో–ఆప్షన్ సభ్యురాలు శోభారెడ్డి, మెప్మా సీవో భార్గవి, ఆర్పీలు, మహిళా సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

అధ్వాన్నంగా లింగాపూర్ రోడ్డు



రోడ్డు గురించి వివరిస్తున్న కాంగ్రెస్ నాయకులు

మేడ్చల్: రోడ్డు నిర్మించి ఆరు నెలలు గడవక ముందే మండలంలోని లింగాపూర్ –డబీల్‌పూర్ రోడ్డు అధ్వాన్నంగా తయారైందని డబీల్‌పూర్ గ్రామ కాంగ్రెస్, మండల కాంగ్రెస్ నాయకులు ఆరోపించారు. లింగాపూర్, డబీల్‌పూర్ రోడ్డును నాయకులు సందర్శించి రోడ్డును మీడియాకు చూపించారు. రోడ్డును నిర్మించి ఆరు నెలలు కూడా పూర్తి కాలేదని, అప్పుడే అధ్వాన్నంగా మారిందని కాంట్రాక్టర్ నాసిరకంగా నిర్మించడం వల్లే రోడ్డు పూర్తిగా దెబ్బతిందని అన్నారు. వంద ఫీట్ల రోడ్డు మంజూరైనా చేయడం లేదని అన్నారు. నాయకులు రాజురెడ్డి, వెంకటేష్, సలాం, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సల్ల వెంకటేష్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

జైజై గణేశా.. అభయములివ్వు గణేశా..



కీసరలో యాదవసంఘం యూత్ ఆధ్వర్యంలో వినాయకుడి వద్ద రామిడి స్వప్నవిజయ్‌రెడ్డి

కీసర: మండలంలోని వివిధ గ్రామాలతో పాటు నాగారం, దమ్మాయిగూడ మున్సిపాలిటీల్లో గణేష్ నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. సోమవారం మండల కేంద్రమైన కీసర చౌరస్తాలో యాదవ సంఘ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణేష్ మండపం వద్ద కీసర గ్రామ పంచాయతీ 4వ వార్డు సభ్యురాలు రామిడి స్వప్నవిజయ్‌రెడ్డి సుమారు 2000 మంది భక్తులకు అన్నదానం చేశారు. దమ్మాయిగూడ, నాగారం మున్సిపాలిటీ పరిధిలోని వివిధ వార్డుల్లో గణేష్ మండపాల వద్ద మున్సిపల్ చైర్మన్లు చంద్రారెడ్డి, ప్రణితాగౌడ్, వైస్ చైర్మన్లు మల్లేష్‌యాదవ్, నరేందర్‌రెడ్డి తదితరులు పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.